చేపలు పట్టేందుకు వెళ్లి మృతి

కొడంగల్, సెప్టెంబర్ 29: మున్సిపల్ పరిధిలోని గుండ్లకుంట గ్రామానికి చెందిన ఉష ప్ప (48) శనివారం రాత్రి హస్నాబాద్ గ్రామ చెరువుకు చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ శివరాములు తెలిపారు. చేపలు పట్టేందుకు వెళ్లే క్రమంలో అకస్మాత్తుగా చెరువులోతులోకి చేరుకోవడంతో ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆదేశాల మేరకు దర్యాప్తు చేపడుతున్నట్లు హెడ్ కానిస్టేబుల్ పేర్కొన్నారు.

నేడు ఎల్మకన్నె పీఏసీఎస్ సమావేశం

తాండూరు రూరల్, సెప్టెంబర్ 29 : తాండూరు మండలం, ఎల్మకన్నె పీఏసీఎస్ సమావేశాన్ని ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్నట్లు సీఈవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11.30 గంటలకు సల్లాగార్డెన్‌లో జరిగే సమావేశానికి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. అదేవిధంగా డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్ కూడా హాజరు కానున్నారని తెలిపారు. సమావేశానికి డైరెక్టర్లు, రైతులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

మహిళా ఓటర్లే అధికం

- మొత్తం ఓటర్లు 6,71,940 మంది
- కులకచర్లలో అత్యధిక ఓటర్లు..
- బంట్వారంలో అత్యల్పం..

బొంరాస్‌పేట సెప్టెంబర్ 29: జిల్లా అధికార యంత్రాంగం గ్రామాల్లోని వార్డుల వారీగా ఓటరు జాబితాను రూపొందించింది. ఇటీవల అధికారులు ప్రకటించిన తుది జాబితా ప్రకారం వికారాబాద్ జిల్లాలోని 18 మండలాల్లో 585 గ్రామ పంచాయతీలు ఉండగా 4982 వార్డులు ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 6,71,940 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 3,32,038 మంది కాగా, మహిళా ఓటర్లు 3,39,885 మంది, ఇతరులు 17 మంది ఉన్నారు. కులకచర్లలో అత్యధికంగా 49,212 మంది ఓటర్లు ఉండగా అత్యల్పంగా బంట్వారం మండలంలో 17,278 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లాలో పురుషుల కన్నా మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

వికారాబాద్ జిల్లాలోని మండలాల వారీగా ఓటర్ల వివరాలు

క్ర.	మండలం	పంచాయతీలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
1	బంట్వారం	12	8437	8841	-	17278
2	బషీరాబాద్	39	18983	20828	-	39811
3	బొంరాస్‌పేట	50	21980	22385	6	44371
4	ధారూరు	34	17529	18073	-	35602
5	దోమ	36	21651	21506	-	43157
6	దౌల్తాబాద్	35	21288	22102	3	43393
7	కొడంగల్	26	15794	16203	-	31997
8	కోట్‌పల్లి	18	10237	10625	-	20862
9	కులకచర్ల	45	24702	24506	4	49212
10	మర్పల్లి	29	22540	22001	1	44542
11	మోమిన్‌పేట	29	19200	19430	-	38630
12	నవాబుపేట	32	18663	18344	-	37007
13	పరిగి	37	18434	18539	1	36974
14	పెద్దేముల్	38	19376	20407	-	39783
15	పూడూరు	32	21311	21253	-	42564
16	తాండూరు	33	22229	23318	1	45548
17	వికారాబాద్	21	11740	12006	-	23746
18	యాలాల	39	17944	19518	1	37463
	మొత్తం	585	332038	339885	17	671940

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మర్పల్లి, సెప్టెంబర్ 29 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006-07 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో అప్పటి ఉపాధ్యాయులతో కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ బాగోగులు తెలుసుకున్నారు.. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు అశోక్, సంగయ్య, విశ్వనాథం, మాధవీలత, సురేశ్, జైపాల్, వెంకటేశంలను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు రాఖీ, శ్రీను, మహేశ్, అర్జున్, ప్రవీణ్, లింగం, వెంకట్, నర్సింహులు, రవి, భానుకుమార్, సక్కమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు

వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలని తీర్మానం

పీఏసీఎస్ మహాసభలో మాట్లాడుతున్న అధ్యక్షుడు కటకం శివకుమార్

కొడంగల్, సెప్టెంబర్ 29: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం హస్నాబాద్, కొడంగల్ సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మహాజన సభలో పలు తీర్మానాలు చేసినట్లు పీఏసీఎస్ అధ్యక్షులు కటకం శివకుమార్ తెలిపారు. సమావేశంలో సంఘం జమా, ఖర్చులను ఆమోదించారు. కార్యాలయ ఆవరణలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని భూములకు రుణాలు ఇవ్వడానికి ఎండీసీసీబీ అధ్యక్షుడు సీఈవోకు విజ్ఞప్తి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. సమావేశంలో సంఘం కార్యవర్గ సభ్యులు నారాయణ, నర్స్యనాయక్, రాఘవేందర్‌రెడ్డి, వినోద్‌కుమార్, దత్తురెడ్డి, బుగ్గప్ప, ఫకీరప్ప, రామప్ప ఎల్లమ్మ, సాయమ్మలతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

నాటక సమాజాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా నాగేశ్వర్



రాష్ట్ర కమిటీ నాయకులను సన్మానిస్తున్న జిల్లా కమిటీ నాయకులు

పరిగి, సెప్టెంబర్ 29 : తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా శాఖ అధ్యక్షుడిగా బి.నాగేశ్వర్, గౌరవాధ్యక్షులుగా డాక్టర్ సత్యనారాయణగౌడ్, ఎం.అంజిలయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా డి.వెంకటేశ్, పి.జగదీశ్వర్, లాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎన్.జగన్, సంయుక్త కార్యదర్శులుగా జి.నారాయణ, డి.శ్రీశైలం, ఆర్.నర్సింహులు, ప్రచార కార్యదర్శిగా పి.నర్సింహులు, కోశాధికారిగా ఎం. సత్యనారాయణరెడ్డి, సలహాదారులుగా బి.రాఘవేంద్రచారి, బి.వెంకటేశంలు ఎన్నికయ్యారు. తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర కమిటీ ప్రచార కార్యదర్శి వరకవుల దుర్వాసరాజు, ఉపాధ్యక్షులు సోమా అంజిరెడ్డి, మాలేల అంజిలయ్యగౌడ్, కోశాధికారి సూర్యవర్ధన్‌రెడ్డి, సహాయ కార్యదర్శి సిరిగిరి రామాచారిల ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. అనంతరం రాష్ట్ర కమిటీ నాయకులను జిల్లా కమిటీ తరపున సన్మానించారు.

మేలు రకం పశు సంపద వృద్ధిపై ప్రత్యేక దృష్టి

దేశీ పశువులకు కృత్రిమ గర్భధారణ చికిత్స చేస్తున్న పశువైద్యులు. (ఫైల్ ఫోటో)

కొడంగల్, సెప్టెంబర్ 29: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడిని సాధించే దిశగా ప్రభుత్వం ప్రత్యేకంగా పాడి రైతులను ప్రోత్సహిస్తున్నది. మేలు రకమైన జాతికి సంబంధించిన సెమన్‌ను సేకరించి దేశీ పశువుల్లో ఫలదీకరణం చేసే దిశగా పశువైద్యులు చర్యలు తీసుకుంటున్నారు. కేవలం రూ.40 రుసుముతో మేలురకానికి చెందిన సెమన్‌ను దేశీ ఆవుల్లో ప్రవేశపెట్టి మేలు రకం జాతి పశువులను పుట్టిస్తున్నట్లు తెలిపారు. దీంతో పాడి రైతులు అధిక ధరలు చెల్లించకుండానే మేలు రకం జాతి పశువులను సొంతం చేసుకుంటున్నారు. దీంతో అధిక పాల ఉత్పత్తితో ఆర్థికంగా ఎదగడంతో పాటు మేలు రకం జాతి పశు సంతతిత కూడా గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. కొడంగల్ పరిధిలో మొత్తంగా ఇప్పటి వరకు దేశీ పశువుల్లో కృత్రిమ గర్భధారణతో దాదాపు 198 వరకు మేలు రకం దూడల జననం జరిగినట్లు పశువైద్యాధికారులు వెల్లడించారు. పుట్టిన ప్రతి దూడ చాలా ఆరోగ్యంగా ఉందని, వాటికి సరైన సమయాల్లో చికిత్సను అందించి కాపాడుతున్నట్లు తెలిపారు. వాటి పెంపకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ముర్ర, ఒంగోలు, గిరి, జర్సీ వంటి దూడలు పుట్టినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 198 మేలు రకం పశువుల సంతతి రానున్న రోజుల్లో గణనీయంగా పెరిగి పాడి సంపద మరింత అభివృద్ధి చెందనున్నట్లు పశువైద్యులు పేర్కొంటున్నారు. మేలు రకం జాతి పశువుల పెంపకానికి ముందుకు వచ్చిన ప్రతి రైతునూ అభినందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఇటువంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పాడి సంపదను పెంచుకోని ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. మేలు రకం జాతి పశువులను పుట్టించడంతో ఆడ దూడలు జన్మించే విధంగా కూడా చర్యలు తీసుకొంటున్నట్లు పేర్కొన్నారు. ఆడ దూడల సంతతి పెరిగితే అవి పెరిగి పెద్దయ్యాక పాడి రైతులకు అధికంగా పాల దిగుబడిని అందించే ఆస్కారం ఉందన్నారు. కాగా ప్రభుత్వం పాడి రైతులకు పశుగ్రాసాన్ని పెంచుకునే విధంగా 75 శాతం సబ్సిడీపై గడ్డి విత్తనాలను అందిస్తున్నదని పశువైద్యాధికారులు తెలిపారు. అదేవిధంగా సబ్సిడీపై గడ్డి కట్టింగ్ మిషన్లనూ కూడా అందిస్తున్నట్లు తెలిపారు.

రైతులు ముందుకు రావడం సంతోషం

మేలు రకం జాతి పశువుల సంతతిని పెంచుకునేందుకు రైతులు ముందుకు రావడం చాలా సంతోషంగా ఉంది. దేశీ పశువుల్లో మేలు రకం సెమన్‌ను ప్రవేశపెట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు కొడంగల్ పరిధిలో దాదాపు 198 వరకు మేలు రకం పశువుల పుట్టాయి. పుట్టిన దూడలు పెద్దగా పెరుగుతున్నాయి. ముర్ర, ఒంగోలు, గిరి, జర్సీ వంటి పశువులను కొనుగోలు చేయాలంటే లక్షల్లో పెట్టుబడి అవుతుంది. కేవలం రూ.40తో మేలు రకం సెమన్‌ను దేశీ ఆవుల్లో ప్రవేశపెట్టి మేలు రకం జాతి పశువులను పుట్టించుకోవడం ఉత్తమం. అదేవిధంగా ప్రసుతం కేవలం ఆడ దూడలు పుట్టించే విధంగా కూడా చికిత్సలు నిర్వహిస్తున్నాం. దీంతో పాడి పశువులు గణనీయంగా పెరిగి పాల దిగుబడి ఆశించినంత మేరకు పెరుగుతుంది. దాంతో పాడి రైతు ఆర్థికంగా నిలదగ్గుకునే అవకాశం ఏర్పడుతుంది. అదేవిధంగా గొర్రెలు, మేలకు సీజన్ వ్యాధుల నివారణకు గాను ముందుస్తుగా టీకాలు అందిస్తున్నాము.

-డాక్టర్ నోవా, ఏడీ, పశువైద్యాధికారి, కొడంగల్

రుణాలు చెల్లించి అభివృద్ధికి సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణ రెడ్డి

ధారూరు,సెప్టెంబర్ 29: ధారూరు వ్యవసాయ సహకార సంఘంలో బాకాయి ఉన్న రైతులు ఎల్‌టీ, క్రాఫ్‌లోను ఉన్న రైతులు బకాయి చెల్లించి సంఘం అభివృద్ధికి తోడ్పడాలని ధారూరు వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో రుణాలు తీసుకున్న వారికి రుణ మాఫీ కాని రైతులకు వెంటనే రుణమాఫీ అయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సహకార సంఘల అధ్యక్ష పదవులు కూడా రిజర్వేషన్‌చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎలాగైతే రిజర్వేషన్లు ఉన్నాయో అదేవిధంగా సహకార సంఘాలకు కుడా రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజూనాయక్, సీఈవో నర్సింహులు, డైరెక్టర్లు, సంఘం సభ్యులు ఉన్నారు

ఎమ్మెల్యే రాజాసింగ్ ఇంటి వద్ద రెక్కీ

పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు

పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు యువకులు

సుల్తాన్‌బజార్, సెప్టెంబర్ 29: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ నివాసానికి అతి దగ్గర నుంచి ఓ వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మొబైల్ ఫోన్ ద్వారా ఫొటోలు, వీడియోలు తీశారు. గమనించిన స్థానికులు వారిద్దరిని పట్టుకొని ప్రశ్నించారు. వారిద్దరిపై అనుమానం రావడంతో స్థానిక పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ హత్యకు కుట్ర జరుగుతోందా.. అర్ధరాత్రి సమయంలో అతడి ఇంటి వద్ద రెక్కీ నిర్వహించారా..? ఈ కుట్ర వెనుక ఎవరైనా ఉన్నారా..? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఈ నెల 27న అర్ధరాత్రి యూసుఫ్‌గూడకు షేక్ ఇస్మాయిల్, మహ్మద్ ఖాజా కలిసి నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై వచ్చి.. రాజాసింగ్ ఇంటి వద్ద రెక్కీ నిర్వహిస్తున్నారు. అనుమానం వచ్చిన స్థానికులు ఆ ఇద్దరిని ఆపి ప్రశ్నించారు. ఆ ఇద్దరి ఫోన్లలో రాజాసింగ్ ఇంటి ఫొటోలు, వీడియోలు, గన్‌లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో స్థానికులు ఆ ఇద్దరిని పట్టుకొని మంగళ్‌హాట్ పోలీసులకు సమాచారమిచ్చి అప్పగించారు. పోలీసులు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ప్రమాదవశాత్తు కార్మికుడి మృతి

రవికుమార్(ఫైల్)

మూసాపేట, సెప్టెంబర్ 29: కేబుల్ లైన్ వేయడానికి తవ్వుతున్న క్రమంలో పైన మట్టి కూలి ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. రంగనాయక స్వామి ఆలయం సమీపంలోని హానర్స్ కన్‌స్ట్రక్షన్‌లో బీహార్‌కు చెందిన రవికుమార్ (20) కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ లైన్ తవ్వకాలు చేపట్టారు. తవ్వకాలు జరుగుతున్న క్రమంలో రవికుమార్‌పై ఒక్కసారిగా మట్టి కూలింది. ఆ మట్టిలో చిక్కుకున్న రవికుమార్‌ను తోటి కార్మికులు గమనించి.. వెంటనే మట్టి నుంచి అతడిని బయటకు తీసి స్థానిక దవాఖానకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కీసర, సెప్టెంబర్ 29: ఉప్పల్ ప్రాంతానికి చెందిన బి.అనిల్‌కుమార్ (40) శనివారం రాత్రి ద్విచక్ర వాహనంపై రాంపల్లి దాయర ఔటర్‌రింగ్ సర్వీసు రోడ్డు మీదుగా ఉప్పల్ వైపు వెళ్తున్నాడు. రాంపల్లిదాయరకు సమీపంలోని శ్రీ రామలింగేశ్వరకాలనీ రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. దీంతో వాహనంపై ఉన్న అనిల్‌కుమార్ తలకు బలంగా దెబ్బలు తగిలాయి. బాటసారులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారమిచ్చారు. ఘటనా స్థలానికి వచ్చిన 108 అంబులెన్స్‌లో అతడిని చికిత్స నిమిత్తం ఈసీఐఎల్‌లోని శ్రీకర్ దవాఖానకు తరలించారు. అక్కడి డ్యూటీ డాక్టర్ పరీక్షించి అప్పటికే ఆయన చనిపోయాడని తెలిపారు. ఈ కేసును కీసర పోలీసులు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో యువకుడి దుర్మరణం

కీసర, సెప్టెంబర్ 29: జమ్మిగడ్డ ప్రాంతానికి చెందిన 9 మంది స్నేహితులు ఆదివారం ఉదయం ద్విచక్ర వాహనాలపై అంకిరెడ్డిపల్లి గ్రామం వైపు వెళ్లారు. తిరిగి రాత్రి 7 గంటల సమయంలో కీసర మీదుగా ద్విచక్ర వాహనాలపై జమ్మిగడ్డకు బయలుదేరారు. కీసరలోని పెద్దమ్మ చెరువు సమీపంలో ముందు వెళ్తున్న ఆటోను ద్విచక్ర వాహనదారులు ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో బాల్‌రాజ్ (26) అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురికి కూడా గాయపడ్డాడు. తోటి స్నేహితులు కలిసి ద్విచక్ర వాహనంపై వారిని చీర్యాల్ చౌరస్తాలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లారు. బాల్‌రాజ్ పరిస్థితి సీరియస్‌గా ఉన్నదని చెప్పి.. మరో ఆస్పత్రికి తరలించాలని సూచించగా.. నాగారంలోని విజయ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి.. అప్పటికే అతడు చనిపోయినట్టు చెప్పారు.

వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ బాలస్వామి

వాహనాల దొంగల అరెస్టు

అడ్డగుట్ట, సెప్టెంబర్ 29: ద్విచక్ర వాహనాల దొంగలను చిలకలగూడ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ. 10 లక్షల విలువ చేసే 18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి వివరాల వెల్లడించారు. కామారెడ్డికి చెందిన శ్రీనివాస్ 15 ఏండ్ల కిందట నగరానికి వచ్చాడు. 2020లో కొవిడ్‌తో అతడి భార్య మరణించింది. దీంతో 2022లో మరో పెండ్లి చేసుకున్నాడు. మూడు నెలలకే ఆమెను వదిలిపెట్టి.. మద్యం, గంజాయికి బానిసయ్యాడు. డబ్బుల కోసం దొంగతనాలు మొదలుపెట్టాడు. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, మెదక్ ప్రభుత్వ ఆస్పత్రులు, మెట్రో స్టేషన్ల వద్ద బైక్‌లను దొంగిలించాడు. చోరీ చేసిన వాహనాలను చర్లపల్లికి చెందిన ఏసు రత్నం(38), శాంతారావు(28), దమ్మాయిగూడకు చెందిన శ్రీను(32)కు విక్రయించాడు. బాధితుల ఫిర్యాదులతో కేసు నమోదు చేసుకున్న చిలకలగూడ పోలీసులు.. చాకచక్యంగా నిందితులు నలుగురిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి సుమారు రూ. 10 లక్షల విలువ చేసే 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సమావేశంలో చిలకలగూడ అదనపు డీసీపీ నర్సయ్య, ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌తో పాటు ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ విజేత డాక్టర్ ఉషాలక్ష్మి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 29 (నమస్తే తెలంగాణ): గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం జరిగిన పింక్ పవర్ రన్ కార్యక్రమంలో క్యాన్సర్ విజేత డాక్టర్ ఉషాలక్ష్మిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా సత్కరించారు. డాక్టర్ ఉషాలక్ష్మి ప్రముఖ గైనకాలజీ ప్రొఫెసర్‌గా పనిచేసి.. ఉషాలక్ష్మి బ్రెస్ట్ క్యాన్సర్ ఫౌండేషన్ అనే సాంఘిక సేవా సంస్థను స్థాపించారు. ఈ సంస్థ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ.. అనేక మంది ప్రాణాలను కాపాడారు. డాక్టర్ ఉషాలక్ష్మి స్ఫూర్తితో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో ఉషాలక్ష్మి సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్, దక్షిణ ఆసియాలోనే మొదటి సంపూర్ణ బ్రెస్ట్ ఆరోగ్య కేంద్రాలను స్థాపించారు.

నేడు సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 29: రిఫ్లెక్షన్ ఐఏఎస్ అకాడమీ, నమస్తే తెలంగాణ, తెలంగాణ టుడే సంయుక్తాధ్వర్యంలో సోమవారం ఖైరతాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో సివిల్ సర్వీసెస్‌పై అవగాహన సదస్సును నిర్వహిస్తున్నారు. సివిల్ సర్వీసెస్‌ను ఎంచుకున్న విద్యార్థులకు ఐఆర్ఎస్ అధికారి కె. శశికాంత్, రిఫ్లెక్షన్ ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ రమణ ముప్పాల, ఐఐఎంసీ కళాశాల ప్రిన్సిపాల్ కె. రఘువీర్ నేతృత్వంలో అవగాహన కల్పిస్తారు.

రంగారెడ్డి జిల్లా జేఎల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ప్రభుత్వ కాలేజీల జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ప్రెసిడెంట్‌గా జగదీశ్, వీపీగా చైతన్య, జనరల్ సెక్రటరీగా సైదులుతోపాటు 10 మందితో కూడిన కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రామానుజా చారి తెలిపారు. ఈ నూతన కమిటీ 2027 వరకు కొనసాగనున్నది. జూనియర్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి అహర్నిశలు కృషి చేస్తామని కొత్తగా ఎన్నికైన కార్యవర్గం పేర్కొంది.

యువకుడి దారుణ హత్య

చిక్కడపల్లి, సెప్టెంబర్ 29: దోమలగూడ పీఎస్ పరిధిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి కథనం ప్రకారం.. లోయర్ ట్యాంక్ బండ్‌లోని గోశాల వెనుక శనివారం రాత్రి ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. క్లూస్ టీం కూడా వచ్చి ఆధారాలు సేకరించారు. హత్యకు గురైన యువకుడు ముషీరాబాద్‌లోని భరత్‌నగర్‌కు చెందిన మహ్మద్ బషీర్ (30)గా గుర్తించారు. భోలక్‌పూర్ నివాసి అయిన మృతుడి స్నేహితుడే ఈ హత్య చేసినట్లు సమాచారం. హత్యకు ముందు ఇద్దరు స్నేహితులు కవాడిగూడ బార్‌లో మద్యం తాగినట్టు పోలీసులు గుర్తించారు. అయితే, హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని ఇన్స్పెక్టర్ తెలిపారు. ఘటనా స్థలాన్ని డీసీపీ ఆకాంక్ష యాదవ్, ఏసీపీ మొగులయ్య కూడా పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. దోమల్‌గూడ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిటీబ్యూరో, సెప్టెంబర్ 29(నమస్తే తెలంగాణ): వానకాలం సీజన్ ఆఖరి వానలతో నగరం తడిసింది. ఉదయం నుంచి ఉక్కపోత ఉన్న సిటీ వాతావరణం సాయంత్రానికి ఒక్కసారిగా మారిపోయింది. దీంతో నగరంలోని శేరిలింగంపల్లి, మణికొండ, మియాపూర్, గచ్చిబౌలి, నార్సింగి ప్రాంతాల్లో ఉరుములతో కురిసిన భారీ వానకు ఒక్కసారిగా తడిసింది. ప్రధానంగా రాత్రి 8 నుంచి 9 గంటల సమయాన సెంట్రల్ హైదరాబాద్‌లో కురిసిన వానలతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. నగర వ్యాప్తంగా సగటున 7 సెం.మీ. వర్షపాతం నమోదు కాగా, గచ్చిబౌలి, అత్తాపూర్, షేక్‌పేట, టోలిచౌకి, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, ఆసిఫ్‌నగర్, మెహిదీపట్నం, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ ప్రాంతాల్లో వర్షం కుమ్మరించింది. ఉరుములతో కూడిన వానలతో నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. అయితే, అర్ధరాత్రి వరకు నగరంలో భారీ వర్షాలకు అవకాశం ఉన్నదని, నగరవాసులు అత్యవసరమైతేనే బయటకు రావాలని, వరదల్లో మ్యాన్‌హోల్స్ విషయంలో జాగ్రత్త వహించాలని అధికారులు సూచించారు. ఇక సిబ్బందిని కూడా అప్రమత్తం చేసినట్లుగా బల్దియా వర్గాలు వెల్లడించాయి.